AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## టీమిండియా–ఏ జట్టు కెప్టెన్‌గా పంత్



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** దక్షిణాఫ్రికాతో జరగనున్న రెండు మ్యాచ్‌ల కోసం టీమిండియా ఏ జట్టును బీసీసీఐ ప్రకటించింది. ఈ మ్యాచ్‌లు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జరగనున్నాయి. ఈ రెండింటికీ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ కెప్టెన్ వ్యవహరించనున్నాడు. సాయి సుదర్శన్ వైస్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. కాగా.. దక్షిణాఫ్రికా 'ఏ'తో ఈ నెల 30 నుంచి రెండు నాలుగు రోజుల మ్యాచ్‌లు జరుగనున్నాయి.

## ట్రంప్ – పుతిన్ భేటీ వాయిదా



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మరోసారి భేటీకి సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. హంగరీలోని బుడాపెస్ట్ దీనికి వేదికగా నిర్ణయించారు. అయితే, ఈ సమావేశం వాయిదా పడనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అమెరికా మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇరుదేశాల అధ్యక్షుల సమావేశానికి ముందు.. అమెరికా, రష్యా విదేశాంగ మంత్రుల సమావేశం జరగాల్సిఉంది. అయితే, ఇది నిరవధికంగా వాయిదా పడిందని వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశం నిలిచిపోవడానికి గల కారణాలు స్పష్టంగా తెలియలేదు.

21-10-2025 (Tuesday) MAIN EDITION

## బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం: బండి



**అక్షరటుడే, హైదరాబాద్ : బీజేపీతోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి సాధ్యమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. బస్తీలతో నిండిన జూబ్లీహిల్స్‌ను కాంగ్రెస్, బీఆర్ఎస్ గాలికొదిలేశాయని విమర్శించారు. బీజేపీ అభ్యర్థి నామినేషన్ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కోపంతో బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మోసపోతారని ఆయన హెచ్చరించారు.**

## ముగిసిన నామినేషన్ల పర్వం




**అక్షరటుడే, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. చివరి రోజుగా భారీగా నామినేషన్లు దాఖలు అయ్యాయి. అధికారులు బుధవారం నామినేషన్లను పరిశీలించనున్నారు. ఈ నెల 24 వరకు ఉపసంహరణకు గడువు ఉంది.**

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే గెలుపు..



**అక్షరటుడే, హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి మెజారిటీతో విజయం సాధిస్తుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి పాజిటివ్ ఫీడ్ బ్యాక్ వస్తోందన్నారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులు గెలిపిస్తాయని చెప్పారు.**




**మావోయిస్టులు లొంగిపోవాలి. అజ్ఞాతం వీడి జన జీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే చట్టాన్ని గౌరవించే పౌరుల కోసమే తప్ప, చట్టాన్ని ఉల్లంఘించే వారికి కాదు. రాష్ట్రంలో ప్రజల భద్రత, శాంతిని పరిరక్షిస్తూ తెలంగాణ పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగాలి.**

**–సీఎం రేవంత్‌రెడ్డి**

# మావోయిస్టులు లొంగిపోవాలి

- **శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులు ఆదర్శం**
- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**
- **పోలీసు అమరులకు నివాళులు**

పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖ గోషామహల్‌లో నిర్వహించిన పోలీస్ ఫ్లాగ్ డే పరేడ్‌లో సీఎం మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులు దేశానికి ఆదర్శంగా నిలిచారని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ఇటీవలి కాలంలో కొందరు కీలక మావోయిస్టు నాయకులు లొంగిపోయారని, మిగతా వారు సైతం సరెండర్ కావాలని కోరారు. పోలీస్ అంటే సమాజానికి ఒక నమ్మకం, భరోసా అని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఒక్కోసారి ప్రాణాలను సైతం ఫణంగా పెట్టాల్సి వచ్చినా వెనుకడుగు వేయరని కొనియాడారు. పోలీసు ఉద్యోగం కత్తి మీద సాము వంటిదని సీఎం అన్నారు. పోలీసులకు ప్రతి క్షణం పరీక్షే, ప్రతి దినం పోరాటమే అని పేర్కొన్నారు. ఒకవైపు నేరాల అదుపు, మరోవైపు నేరాల విచారణ, ట్రాఫిక్ నియంత్రణ, పగటి గస్తీ, రాత్రి గస్తీ, బందోబస్తు, వీఐపీల రక్షణ.. ఇలా సవాలక్ష బాధ్యతలతో విరామం లేకుండా పని చేస్తూ మనమందరం ప్రశాంతంగా జీవించేందుకు పోలీసులు తమ జీవితాలను త్యాగం చేస్తున్నారని సీఎం అన్నారు. తమ ప్రభుత్వం పోలీసుల సంక్షేమం కోసం అనేక చర్యలను చేపట్టిందన్నారు.

### బాధిత కుటుంబాలకు పరిహారం

సంఘ విద్రోహ శక్తులు, తీవ్రవాదులు, ఉగ్రవాదుల దాడుల్లో వీరమరణం పొందిన, గాయపడి, అంగవైకల్యం పొందిన పోలీసులకు తెలంగాణలో అత్యధిక నష్టపరిహారం అందిస్తున్నట్లు సీఎం తెలిపారు. విధి నిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం, వారి పిల్లలకు రెసిడెన్షియల్ స్కూళ్లలో ఉచిత విద్య, వైద్యం, బస్ పాస్ సౌకర్యం తదితర పథకాలను అందజేస్తున్నట్లు వివరించారు.

### ప్రమోద్ కుటుంబానికి అండగా..

ఈ ఏడాది తెలంగాణలో ఆరుగురు పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయినట్లు సీఎం తెలిపారు. ఇటీవల నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ విధి నిర్వహణలో వీర మరణం పొందారని గుర్తు చేశారు. ప్రమోద్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

## తిరుమల శ్రీవారికి రికార్డు స్థాయి విరాళాలు




**అక్షరటుడే, తిరుమల:** తిరుమల శ్రీవారికి గత 11 నెలల్లో రికార్డు స్థాయిలో రూ.918.6 కోట్లు విరాళాలు అందినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. 2024 నవంబర్ 1 నుంచి 2025 అక్టోబర్ 16 వరకు వచ్చిన విరాళాలలో ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.338.8 కోట్లు, శ్రీవాణి ట్రస్ట్‌కు రూ.252.83 కోట్లు, శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీమ్‌కు రూ.97.97 కోట్లు అందాయని పేర్కొంది. అలాగే ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.66.53 కోట్లు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.56.77 కోట్లు, ఎస్వీ విద్యాదాన ట్రస్ట్‌కు రూ.33.47 కోట్లు, బర్డ్ ట్రస్ట్‌కు రూ.30.02 కోట్లు, ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్ట్‌కు రూ.20.46 కోట్లు, ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్‌కు రూ.13.87 కోట్లు, ఎస్వీ బీసీ ట్రస్ట్‌కు రూ.6.29 కోట్లు, స్విమ్స్‌కు రూ.1.52 కోట్లు వచ్చాయని తెలిపింది.

## చాయ్‌వాలా ఇంట్లో సోదాలు

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** ఓ చాయ్‌వాలా ఇంట్లో పోలీసులు సోదాలు చేపట్టారు. అతడి ఇంట్లో దొరికిన నగదు, నగలు చూసి వారు షాక్ అయ్యారు. బీహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లా అమేథి ఖుర్ద్‌లోని అభిషేక్ కుమార్ అనే వ్యక్తి టీ కొట్టు పెట్టుకొని జీవనం సాగించేవాడు. ఇటీవల పోలీసులు ఆయన ఇంట్లో దాడులు చేపట్టారు. సైబర్ మోసం ఆరోపణలపై సోదాలు చేశారు. ఈ సందర్భంగా అభిషేక్ ఇంట్లో నగదును చూసి అధికారులే షాక్ అయ్యారు. అతడి ఇంట్లో రూ.1.05 కోట్ల నగదు, 344 గ్రాముల బంగారం, 1.75 కిలోల వెండి, బ్యాంకు పాస్‌బుక్‌లు, ఏటీఎంలు స్వాధీనం చేసుకున్నారు.

## అమెరికన్ చెస్ గ్రాండ్‌మాస్టర్ కన్నుమూత



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికన్ చెస్ గ్రాండ్ మాస్టర్ డానియల్ నరోడిట్స్కీ (29) కన్నుమూశారు. టాలెంట్ ప్లేయర్, ఎడ్యుకేటర్ తుది శ్వాస విడిచారని నార్త్ కరోలినాలోని చార్లెట్ చెస్ క్లబ్ స్టేట్మెంట్ విడుదల చేసింది. అయితే ఆయన మృతికి గల కారణాలు వెల్లడించలేదు. 18 ఏళ్లకే డేనియల్ గ్రాండ్ మాస్టర్ హోదా సాధించారు. ఆయన అండర్ 12 వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచారు.

## కాంగ్రెస్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు..



**అక్షరటుడే, హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ల లిస్ట్‌లో దానం నాగేందర్ పేరు ఉండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖైరతాబాద్ ఇబ్రహీం నగర్‌లోని బస్తీ దవాఖానాను కేటీఆర్ మంగళవారం పరిశీలించారు. ఆస్పత్రిలోని వసతులపై ఆరా తీశారు. ఉద్యోగుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్ పేరు కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ల లిస్ట్‌లో ఎలా ఉందని ఆయన ప్రశ్నించారు. దానం నాగేందర్ ఏ పార్టీలో గెలిచారు.. ఏ పార్టీకి క్యాంపెయిన్ చేస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. ఏఐసీసీ అంటే ఆల్ ఇండియా కరెప్షన్ కమిటీ అని విమర్శించారు. తమ పార్టీలో గెలిచినోళ్లను తీసుకొని, వాళ్ల పార్టీ క్యాంపెయినర్ల లిస్ట్‌లో పెట్టారన్నారు. స్పీకర్ దగ్గరేమో ఫిరాయింపు ఎమ్మెల్యేలు తాము పార్టీ మారలేదు అని అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి నీతి, రీతి ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. బస్తీ దవాఖానా, అంగన్ వాడీ సిబ్బందికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ పాలనలో బస్తీ దవాఖానాలకు సుస్తీ



**అక్షరటుడే, హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వంలో బస్తీ దవాఖానాలకు సుస్తీ చేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లిలో బస్తీ దవాఖానాను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బస్తీ దవాఖానాలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో పెట్టిన బస్తీ దవాఖానాలను కేంద్ర ఆర్థిక సంఘం సైతం ప్రశంసించిందని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటిని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. బస్తీ దవాఖానాల్లో మందులు, బీపీ మిషన్లలో బ్యాటరీలు కూడా లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉద్యోగులకు జీతాలు సైతం సక్రమంగా చెల్లించడం లేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి మద్యం దుకాణాలపై ఉన్న దృష్టి పేదలకు వైద్యం అందించే బస్తీ దవాఖానాలపై లేదని హరీశ్‌రావు విమర్శించారు. జనం మద్యం తాగాలి, ఖాజానా నిండాలన్నదే రేవంత్ రెడ్డి ఆలోచన అన్నారు. ఎవరూ అడగకున్నా మద్యం దుకాణాల దరఖాస్తుల గడువును పెంచారని చెప్పారు.

## నకిలీ సమాచారం కట్టడికి కొత్త చట్టం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** నకిలీ సమాచారం వ్యాప్తిని కట్టడి చేసేందుకు కొత్త చట్టాన్ని తీసుకువస్తామని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు. మంగళూరు సమీపంలోని పుత్తూరులో సోమవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తప్పుడు సమాచారం వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు నూతన చట్టాన్ని తీసుకొస్తున్నామని వివరించారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చేసేవారిపై, ప్రజలకు నకిలీ సమాచారం అందించడం ద్వారా మత సామరస్యాన్ని దెబ్బతీసే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు నూతన చట్టం రూపొందించాలని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్‌ను సీఎం ఆదేశించారు. ఐటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే, పాటిల్ ఈ చట్టం రూపొందించేందుకు కృషిచేస్తారన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి : మోదీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి అని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. దేశ ప్రజలకు ప్రధాని మోదీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళిని శక్తి, ఉత్సాహంతో నిండిన పండుగగా ఆయన అభివర్ణించారు. ఈ క్రమంలో దేశప్రజలకు బహిరంగ లేఖ రాశారు. "అయోధ్యలో భవ్య రామమందిరం నిర్మాణం తర్వాత ఇది మనకు రెండో దీపావళి వేడుక. శ్రీరాముడు మనకు ధర్మాన్ని నిలబెట్టమని బోధించాడు. అన్యాయాన్ని ఎదుర్కోవడానికి ధైర్యాన్ని ఇచ్చాడు. కొన్ని నెలల క్రితం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ధర్మాన్ని నిలబెట్టుకుంటూనే.. తమకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకుంది" అని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు.

## జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనై తకైచి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** జపాన్ దేశానికి తొలి ప్రధానిగా సనై తకైచి ఎన్నికయ్యారు. ఆ దేశ రాజకీయ చరిత్రలోనే ఇది అరుదైన ఘట్టం. లిబరల్ డెమోక్రటిక్ పార్టీ నిర్వహించిన ఎన్నికల్లో తకైచి ప్రధానిగా ఎన్నికయ్యారు. 465 సీట్లు ఉన్న జపాన్ పార్లమెంట్లో అధికారం చేపట్టాలంటే 233 ఓట్లు సాధించాలి. తకైచి 237 ఓట్లు సాధించింది. ఇలా సనై తకైచిని జపాన్ ప్రధాని పదవి వరించింది. ఆమె జపాన్ 104వ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కాగా.. అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీలో అంతర్గత విభేదాల కారణంగా షిగెరు ఇషిబా తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఇటీవల దేశంలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంటు ఎగువ సభలో అధికార పార్టీ మెజార్టీ సాధించలేదు. అంతకుముందు దిగువ సభలో కూడా మెజార్టీ కోల్పోయింది. దీంతో ఇషిబా రాజీనామా చేశారు.

## రూటు మార్చిన శ్రీలీల..!



**తెలుగు అమ్మాయి శ్రీలీల రూటు మార్చిందా..? కెరీర్‌ని పక్కాగా ప్లాన్ చేసుకుంటుందా..? అంటే అవుననే టాక్ వినిపిస్తోంది. నిన్న మొన్నటి వరకూ తెలుగు చిత్రాల్లో బిజీగా ఉన్న ముద్దుగుమ్మ.. వాటిని పక్కన బెట్టిన విషయం తెలిసిందే. టాలీవుడ్ కంటే పరభాషలకే ఈ అమ్మడు పెద్ద పీట వేసింది. ఈ క్రమంలోనే బాలీవుడ్‌కు వెళ్లింది. టాలీవుడ్‌లో అగ్ర హీరోలతో అవకాశాల కన్నా బాలీవుడ్ కుర్ర హీరోలు ఉత్తమం అనుకుని ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్తుంది. ఇప్పటికే అక్కడ రెండు.. మూడు సినిమాలు కమిట్ అయిన సంగతి తెలిసిందే. అయితే ఇటీవలే ఓ లేడీ ఓరియేంటెడ్ సినిమా చేస్తున్నట్లు కూడా ప్రకటించింది. దీనిని బట్టి ఈ అమ్మడు స్టార్ హీరోల సరసన వచ్చే ఇమేజ్‌తో పని లేకుండా తన సొంత ఇమేజ్‌పై ఎదగాలని చూస్తోందని అర్థమవుతోంది. అయితే ఈ చిత్రాన్ని తమిళ డైరెక్టర్ మిలింద్ రాజ్ డైరెక్ట్ చేయబోతు న్నట్లు వార్తలొస్తున్నాయి. కాగా.. హారర్ థ్రిల్లర్ చిత్రమా? లేక మరో జానరా? అన్నది ఆసక్తికరంగా మారింది.**

– అక్షరటుడే, సినిమాడెస్క్